మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కేసులో రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లే

-గజ్వేల్ సిఐ రవికుమార్

**గజ్వేల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

12సంవత్సరాల తర్వాత కొట్టుకున్న కేసులో అన్న, చెల్లెలు ఇద్దరు రాజీపడినట్లు గజ్వేల్ సిఐ రవికుమార్ తెలిపారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని మున్సిఫ్‌కోర్టు వద్ద నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో గతంలో ఉన్న కేసులన్నీ రాజీ కుదుర్చుకున్నారు. లోక్ అదాలత్ అనేది మంచి అవకాశమని, ఇరువురు గొడవలుపడడంవల్ల కాలం వృథాచేసుకుంటూ కేసులకు తిరగడం సరికాదన్నారు. లోక్ అదాలత్‌లో వందలాదికేసులు రాజీకుదిరినట్లు తెలిపారు. అదేవిధంగా గత 12 సంవత్సరాల నుండి డబ్బులవిషయంలో అన్నాచెల్లెలు గొడవకారణంగా ఇరువురిపై నమోదుచేసిన కేసును లోక్ అదాలత్‌లో రాజీకుదిర్చినట్లు తెలిపారు. ఇరువర్గాలను లోక్ అదాలత్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించగా మున్సిఫ్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్, కోర్టు కానిస్టేబుల్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్ చొరవతో ఇరువర్గాల వారు రాజీపడినట్లు సిఐ రవికుమార్ తెలిపారు.

## చెరువును తలపిస్తున్న రోడ్లు

**అక్కన్నపేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

మండలంలోని గౌరవెల్లి గ్రామంలో స్థూపం సమీపంలో నిర్వాసితులు కట్టుకున్న ఇళ్లకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపిస్తోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పక్కనే ఉన్న పిచ్చిమొక్కలు, కుళ్లిపోయిన చెట్లు, ప్లాస్టిక్ కవర్లు పైకితేలడంతో ఇళ్లలోకి నడుచుకుంటూ వెళ్లడం పక్కనపెడితే వాహనాలమీదకూడా పోయేపరిస్థితి లేకపోగా విపరీతమైన దుర్వాసన వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఆమురుగునీటినుండి నడిచివెళ్లేందుకు వీలులేకపోగా ద్విచక్రవాహనాలపై వెళ్దాం అనివెళ్తే దారిమొత్తం నీరు నిల్వ ఉండడంతో గుంతలు కనిపించడంలేదని, అలాగే వెళ్తే వాహనాలపైనుండి కిందపడి ప్రమాదాలుజరిగే అవకాశం లేకపోలేదని ఆరోపిస్తున్నారు. ఈదారిలో నీరు నిల్వలేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపానపోవడంలేదని వాపోతున్నారు. కాలనీలో నీరు నిల్వలేకుండా అధికారులు చొరవ తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## ఎంపి కృష్ణయ్యను కలిసిన బిసి సంఘం నేతలు



ఎంపి ఆర్.కృష్ణయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిసిసంఘం నేతలు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ఎంపి ఆర్.కృష్ణయ్య జన్మదినం సందర్భంగా శనివారం బిసి సంక్షేమసంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్‌యాదవ్, సురేష్, నరేష్, శ్రీను తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం అనేది ఎంపి ఆర్.కృష్ణయ్య చేసిన సుదీర్ఘపోరాట ఫలితమేనని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బిసిల కోసం 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

## గ్రూప్-1 పరీక్ష అవకతవకలపై న్యాయవిచారణ జరిపించాలి

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

గ్రూప్-1 పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని...తప్పును సరిదిద్దుకోకుండా ప్రభుత్వం మరోసారి అప్పీల్‌కి వెళ్లాలని ప్రయత్నించడం సిగ్గుచేటని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రూప్-1లో ఉద్యోగానికి మంత్రులు, అధికారులు లక్షల రూపాయలు నిరుద్యోగుల వద్ద లంచం అడిగారని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి రెండులక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులకు తీరని అన్యాయంచేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగుల పక్షాన పోరాటంచేస్తా, అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసి న్యాయం జరిగేవరకు కృషిచేస్తానని తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతను పూర్తిగా మోసంచేస్తుందన్నారు. జాబ్‌మేళాలలో అవకాశం వచ్చిన ప్రతి ఒక్కరూ ఉద్యోగంలో చేరి సద్వినియోగంచేసుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి మరిన్ని జాబ్‌మేళాలు ఏర్పాటుచేస్తానని తెలిపారు. కాగా జాబ్‌మేళాకు నిరుద్యోగ యువతీ యువకులు పెద్దయెత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సమాజ భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంది...**

సమాజ భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వైశ్యభవనంలో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేపాల్, బంగ్లాదేశ్‌లో వచ్చిన విప్లవాలు దేశంలో రావద్దు అంటే సామాజిక నైతికబాధ్యతలు నేర్పాలన్నారు. యువత డ్రగ్స్, గంజాయికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య అనేది ఉద్యోగం కోసమే కాకుండా, గొప్ప సమాజనిర్మాణం కోసం అవసరమన్నారు. విద్యార్థులు డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌పై దృష్టిపెట్టకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ట్రస్మా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు...**

సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో రజకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి హరీష్‌రావు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె పోరాటస్ఫూర్తిని, ఆశయాలను స్మరించుకున్నారు. ఆయనవెంట ఎమ్మెల్యే శ్రీనివాస్, రజక సంఘం ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కాగా గత బిఆర్ఎస్ సర్కార్ హయాంలో గ్రామంలోని పాత ఇళ్లను కూల్చివేసి కొత్తగా డబుల్ బెడ్‌రూంలను నిర్మించిన క్రమంలో కొంతమంది ఇళ్లను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశారని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించాలని బాధితులు హరీష్‌రావుకు విన్నవించారు.

## మీరాకతో కొండంత ధైర్యం..అండ వచ్చింది

-బతుకమ్మ వేడుకలకు రావాలని ఎమ్మెల్సీ కవితకు చింతమడక గ్రామస్థుల ఆహ్వానం



బతుకమ్మ సంబరాలకు రావాలని ఆహ్వానిస్తున్న గ్రామస్థులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

బిఆర్ఎస్ బహిష్కృత నేత ఎమ్మెల్సీ, జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన స్వగ్రామమైన సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామస్థులతో ముచ్చటించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తన స్వగ్రామమైన చింతమడక గ్రామంలోని అన్ని కులసంఘాల పెద్దలు, మహిళలు హైదారాబాద్‌కు తరలివెళ్లి జాగృతి క్యాంపు కార్యాలయంలో ఇటీవల కలువగా వారిని ఆహ్వానించి అప్యాయంగా పలకరించినట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. మాజీ సిఎం కెసిఆర్ ఎదుగుదలకు ఎంతగానో ప్రోత్సహించారని...మీ ధైర్యంతోనే నాన్న తెలంగాణ సాధించడంతో పాటు సిఎం స్థాయికి వచ్చారని గ్రామస్థులతో ముచ్చటించినట్లు తెలిసింది. నాన్నమాదిరి ఆదరాభిమానాలు అందించాలని తనను కలవడానికి వచ్చిన గ్రామస్తులతో అప్యాయంగా మాట్లాడినట్లు సమాచారం. ఈనెల 21 ప్రారంభం అయ్యే బతుకమ్మ వేడుకలకు రావాలని కవితకు స్వగ్రామమైన చింతమడక గ్రామస్థులు, అన్ని కులసంఘాల పెద్దలు, మహిళలు ఆహ్వానపత్రికను అందజేశారు. తప్పకుండా హాజరవుతానని కవిత గ్రామస్థులకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుపై తీవ్ర ఆరోపణలు చేసి బిఆర్ఎస్‌లో అలజడి కారణమై పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ కవిత ఈనెల 21న స్వగ్రామమైన చింతమడకకు రానుండడంతో అసక్తి నెలకొంది. హరీష్‌రావుపై ఆరోపణలు చేసిన అనంతరం ఆయన ఇలాకాలో మొదటిసారిగా బతుకమ్మ సంబరాలకు ఎమ్మెల్సీ కవిత హాజరవుతుండడంతో సిద్దిపేటలో రాజకీయ చర్చ మొదలైంది.

# అధికారుల అండతోనే యూరియా అక్రమ దందా...!

-అక్రమదందా వెనుక రాజకీయ నాయకుల హస్తం?
-కృత్రిమకొరత సృష్టించి రైతులను ఇబ్బంది పెడుతూ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగంకలిగించే వారిపై చర్యలు ఉంటాయా?
-అక్కన్నపేట యూరియా దొంగల విచారణ ఎమైందో...!

**హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

రైతులు సాగుచేసుకుంటున్న పంటలకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే యూరియా పక్కదారి పడుతుందా అంటే హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా అవును అని చెప్పాల్సిన పరిస్థితులే కనిపిస్తున్నాయి. అయితే శుక్రవారం అక్కన్నపేట మండలంలోని నందారం గ్రామానికి చెందిన కరివేద సంజీవరెడ్డి అనేవ్యక్తి వందలాది యూరియా బస్తాలను అక్రమంగా నిల్వచేసి అధికధరలకు విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న అక్కన్నపేట మండల వ్యవసాయశాఖ అధికారి తస్లీమా సుల్తానా సంజీవరెడ్డి ఇంట్లో తనిఖీలు నిర్వహించి దొరికిన తొమ్మిది యూరియా బస్తాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. అయితే ఈ అక్రమదందాగురించి ఆరాతీసే ప్రయత్నంచేయగా ఈదందా ఒక్క అక్కన్నపేట మండలంలోనే కాకుండా హుస్నాబాద్ మండలంతోపాటు నియోజకవర్గవ్యాప్తంగా జోరుగా సాగుతుందని అర్థమౌతుంది. ఈ అక్రమ యూరియా వ్యవహారంలో స్థానికంగా విధులు నిర్వహించే వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఈవో)ల పాత్ర ఎక్కువ ఉంటుందని, తమశాఖ అధికారుల ప్రమయంలేకుండా యూరియా పక్కదారిపట్టే అవకాశంలేదని ఆశాఖకు చెందిన అధికారులే గుసగుసలాడుతున్నారు. యూరియాసరఫరా విషయంలో రాష్ట్రవ్యవసాయశాఖ కమిషనర్‌నుండి జిల్లా వ్యవసాయశాఖాధికారి అలర్ట్‌మెంట్ మేరకు ప్రతి లారీ కూడా సజావుగానే నియోజకవర్గానికి చేరుకుని అక్కడి నుండి పిఎసిఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల వద్దకు వరకు పక్కదారి పట్టకుండా వచ్చే బస్తాలను ఎఈవోలు మండల వ్యవసాయ అధికారులకు తెలియకుండా శాఖాధికారి స్టాంపులు వేసి టోకెన్లు రాసి ఇస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎఈవోలు ఇచ్చే టోకెన్లకు ఒక్కో టోకెన్‌కు రూ.1వంద నుండి 2 వందల చొప్పున వసూలు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యూరియాపంపిణీ విషయంలో పకడ్బందీగా నిర్వహించాలని చూస్తున్నా హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన కొంతమంది ఎఈవోలు వారి బందువులు, మిత్రులు, అంటూ దళారులతోపాటు ఈప్రాంతంలో వివిధపార్టీలకు చెందిన నాయకులకు లైన్లోలేకున్నా వారి ఇంటికే టోకెన్లు పంపిస్తూ ఈ బ్లాక్‌దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. పిఎసిఎస్, ఆగ్రోస్‌లసంగతి పక్కనపెడితే ప్రయివేట్ డీలర్లునడిపించే ఫర్టిలైజర్ దుకాణాల్లో సైతం ఎరువులు అమ్మాలంటే ఎఈవోలు, ఎవోలు ఇచ్చిన టోకెన్లను తప్పనిసరిచేయడంతో ప్రయివేట్ ఫర్టిలైజర్ల నిర్వాహకులనుకూడా ఎఈవోలు డబ్బుల ఆశ చూపి యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుండగా కమిషన్లను ముట్టజెప్పి కొనుగోలు చేస్తున్న యూరియా ఒక్కో బస్తాను దళారులు రూ.500 నుండి 700ల వరకు విక్రయిస్తూ రైతులను నిలువుదోపిడీ చేయడంతోపాటు ప్రభుత్వప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని స్పష్టంగా అర్థమౌతుంది. ఇదిలా ఉంటే శుక్రవారం అక్కన్నపేట మండలంలో వ్యవసాయశాఖ అధికారులు అక్రమంగా యూరియా సరఫరాచేసిన వ్యక్తిపై ఫిర్యాదుచేశారు తప్పితే, అవి ఎక్కడినుండి వచ్చాయి? అతనికి సహకరించిన అధికారులెవరు? కేసు ఎక్కడివరకు వచ్చింది? విచారణ మొదలుపెట్టారా, లేదా? అనే విషయాలను ఎందుకు బయటపెట్టటంలేదో తెలపకపోవడంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనా రైతులకు నేరుగా అందాల్సిన యూరియాను కృత్రిమకొరత సృష్టించి అటు రైతులను మోసం చేయడంతోపాటు ప్రభుత్వాన్ని అభాసుపాలు చేస్తున్న దళారులపై అధికారులు కఠినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత మేధావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



యూరియా బస్తాలు అక్రమంగా నిల్వ ఉంచిన దృశ్యం (సేకరణ దృశ్యం)

# వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతారహితంగా ప్రవరిస్తే కఠినచర్యలు

-వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
-కౌడిపల్లి పిహెచ్‌సి పరిశీలనలో కలెక్టర్ హెచ్చరిక



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**కౌడిపల్లి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

ప్రస్తుతం జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించే వ్యాధుల దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి తప్ప, విధులపట్ల బాధ్యతారహితంగా ప్రవరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలోగల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి, నూతనంగా నిర్మితమౌతున్న సామాజిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని పరిశీలించారు. ముందుగా పిహెచ్‌సిలోని వైద్యాధికారులు, సిబ్బంది హాజర్ పట్టికను, మందుల నిలువ రిజిస్టర్, ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాల పట్టికలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. రానున్న 48గంటల్లో వాతావరణశాఖ హెచ్చరిక మేరకు భారీ నుండి అతిభారీవర్షాలు కురుస్తాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలు స్వీయ రక్షణ పాటించాలని ఆయన తెలిపారు. మంజీరా నదీపరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తిచేశారు. అత్యవసరమయితే తప్ప బయటకురావద్దని, దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. గడిచిన 15రోజుల నుంచి అడపాదడపా భారీ వర్షాలు కురుస్తున్నాయని లో-లైన్ కాజ్‌వేలు, కల్వర్టులు, వరదప్రవాహం ఉన్నవాటిని ప్రజలు దాటేయత్నం చేయవద్దని, దురదృష్టవశాత్తు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కలెక్టర్ హితవు పలికారు. ఉరుములు, మెరుపులు వచ్చి పిడిగులు పడే అవకాశం ఉన్నప్పుడు చెట్ల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కలెక్టర్ తెలిపారు. వర్షాలు పెద్దయెత్తున వస్తున్నాయి కాబట్టి ప్రజలకు సీజనల్ వ్యాధులు చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులుసోకే అవకాశం ఉన్నందున ప్రజలందరూ వ్యక్తిగత, శారీరక, పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారిస్తూ, నీటినిల్వలు ఉండకుండా చూసుకుంటూ, స్వీయరక్షణ పాటించాలని కలెక్టర్‌తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్యసిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాల కరువు

-కోట్లు ఖర్చుపెట్టి ఆసుపత్రులు కట్టి టీకాలు అందుబాటులో ఉంచరా...!?

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటుచేసిన ప్రభుత్వ దవాఖానాలో (పిహెచ్‌సి)లో పిల్లలకు వేసే టీకాలు కరువయ్యాయని అదేగ్రామానికి చెందిన సూరంపల్లి రమేష్ ఆరోపించారు. శనివారం శ్రీకాంత్‌కుమారుడిని నాలుగు నెలలకు వేయవలసిన టీకా వేయించటానికి ఆసుపత్రికి తీసుకెళ్తే విధులునిర్వహిస్తున్న ఎఎన్ఎమ్‌లు టీకాలు మనగ్రామంలో లేవు పక్కనే ఉన్న ఆరెపల్లికి వెళ్లి వేయించుకోవాలని చెప్పారని, అయితే ఆరెపల్లె ఆసుపత్రికి వెళ్లినా కూడా అక్కడ తనకు కావాల్సిన టీకాలు దొరకలేదన్నారు. పసిపిల్లలు భవిష్యత్తులో ఎలాంటిరోగాలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ఇచ్చే టీకాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే లేకపోతే ఎవరిని అడగమంటారని ప్రశ్నించారు. కోట్లుపెట్టి భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం వద్ద డబ్బు ఉంది కాని, పసిపిల్లలకు వేసే టీకాలు మాత్రం అందుబాటులో ఉంచేందుకులేదా? అని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.



మీర్జాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎఎన్ఎమ్‌ల దృశ్యం

## చంద్లాపూర్ లిఫ్ట్ పనులు ప్రారంభించాలి

-ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి
-శాశ్వత కాలువల నిర్మాణం చేపట్టాలి
-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న తన్నీరు హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

నియోజకవర్గంలో ఈ యాసంగికి తలెత్తిన సమస్యలు వచ్చే వానాకాలం, యాసంగి పంటలకు రాకుండా చూడాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్లాపూర్ లిఫ్ట్ పనులు ప్రారంభించాలని ఇర్కోడు లిఫ్ట్‌పనులు వేగవంతం చేయాలన్నారు. ఘనపూర్ పంప్ హౌస్ ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. గోపులాపూర్, కస్తూరిపల్లి చెక్‌డ్యాం పనులు ప్రారంభించాలన్నారు. ఈసారి 50వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చామని పెరిగిన ఆయకట్టు దృష్ట్యా ఆర్‌డి-7, ఆర్‌డి-8, ఆర్‌డి-9 కాలువలు త్వరగా పూర్తిచేయాలన్నారు. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ అనుసంధానం చేయాలని పెండింగ్ కాలువలు, పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమీక్షాసమావేశంలో ఎస్ఈ సుధకిరణ్, డిఎస్ఈ నాగరాజు, ఈఈ(రంగనాయకసాగర్) గోపాలకృష్ణ, ఈఈ రమేష్ (అనంతగిరి రిజర్వాయర్), ఈఈ శంకర్ (మల్లన్నసాగర్), డిఈ చంద్రశేఖర్, ఏఈఈ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కల్హేర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

కల్హేర్ మండలం కిష్టాపూర్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్డిగ్రామానికి చెందిన భూమయ్య(35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. టివిఎస్ బైక్‌పై వెళ్తున్న భూమయ్యను ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడు అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయంలో గుర్తుతెలియని దుండగుల చోరీ



హనుమాన్ ఆలయంలో హుండీ తాళం పగలగొట్టిన దృశ్యం

**కంగ్టి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని పగలగొట్టి దొంగతనం చేసిన ఘటన మండల కేంద్రమైన కంగ్టిలో చోటుచేసుకుంది. శనివారం స్థానికులు తెలిపిన వివరాలు.. కంగ్టిలో ఊరిచివర ఉన్న హనుమాన్ మందిరంలో శుక్రవారం అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చొరబడి హుండీ తాళం పగలగొట్టారు. అందులో భక్తులు సమర్పించిన కానుకలు, నగదును అపహరించారని చెప్పారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## పిడుగుపాటుకు ఆవు మృతి

**కోహెడ, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీకి చెందిన మాందాడి జగన్‌రెడ్డి ఆవు పిడుగుపాటుకు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఆవు విలువ లక్ష రూపాయలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరారు.



పిడుగుపాటుతో మృతి చెందిన ఆవు

## పేద ప్రజలకు సిఎం సహాయ నిధి వరం

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**కేశంపేట సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి గ్రామీణ స్థాయిలో ఉండే నిరుపేదలకు వరం లాంటిదని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేశంపేట మండల లబ్ధిదారులకు మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య వివిధ రకాల అనారోగ్యాలతో బాధపడుతున్న బాధితులకు ఆరోగ్యశ్రీ తో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు నివారించే దిశగా ముఖ్యమంత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సహాయనిధి ద్వారా చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు . కేశంపేట మండలంలో మొత్తం 28మంది లబ్ధిదారులకు 11 లక్షల 16 వేల 500 రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయని అన్నారు. ఆరోగ్య సమస్యలతో సతమయ్యే నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ వీరేష్, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి , సురేష్ రెడ్డి , నర్సింలు , రావుల పెంటయ్య ముదిరాజ్ , ఎండి అమేర్ , శ్రీనాథ్ , సుందరయ్య , సుదర్శన్ , గోపాల్ ముదిరాజ్ , తైద పర్వతాలు, కోడూరు రాములు, నరసింహారెడ్డి , గ్యార సురేష్ , లింగం యాదవ్ , పాండు , కురుడు నర్సింలు పాల్గొన్నారు..

## ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించిన అధికారులు



**మంచాల సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :**
మంచాల మండలం ఆరుట్లలో గల బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయంలో రాబోయే కార్తీక పౌర్ణమి 5వ తేదీ నుండి జాతర ప్రారంభంకానున్న సందర్భంగా బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం మండల అధికారులు సందర్శించారు. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో భక్తులు వస్తారని అందుకు సరిపడా ఏర్పాట్లపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ పర్యటనలో మంచాల మండల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి,తహసీల్దార్ వెంకటప్రసాద్ రావు, మంచాల ఎం.పీ.డీ.వో బాలశంకర్, సిఐ మధు, దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి భక్తులకు ఎక్కడా అసౌకర్యాలు కలగకుండా సరైన వసతులు కల్పించడంపై ఎమ్మెల్యే పలు సూచనలు చేశారని సహకార సంఘం చైర్మన్ వ్యతిరే హనుమంత రెడ్డి తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఇలాంటి సౌకర్యాలు, వసతులు అవసరమో అడిగి తెలుసుకున్నారు.భక్తులకు ప్రసాదం కౌంటర్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునే స్థలాన్ని పరిశీలించారు. ఎం.పీ. ఉమా రాణి, దేవాలయకమిటీ సభ్యులు వెదిరె రమణరెడ్డి పాల్గొన్నారు.

## మొక్కల పంపిణీపై అధికారుల ఆదేశాలు బేఖాతరు...!

**మంచాల సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :**
మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు దాదాపు రెండు నెలల క్రితమే ప్రజలకు మొక్కల పంపిణీ చేయాలని మండల స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేసినా..మంచాల మండలం లింగంపల్లి గ్రామంలో ఇప్పటి వరకు మొక్కల పంపిణీ జరగలేదని గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారులు చెట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేయగా గ్రామస్థాయి సిబ్బంది ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరంలో ఒక్క మొక్క కూడా పంపిణీ జరగలేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కనీసం దోమల నివారణ చర్యలు కూడా గత రెండు సంవత్సరాలుగా చేయలేదని, దోమలతో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్నామని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, వేల కోట్ల రూపాయలతో మొక్కల పంపిణీ చేపట్టగా కొంతమంది అధికారుల అలసత్వంతో పథకం లక్ష్యాలు నీరుగారి పోతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామస్థాయి సిబ్బంది పనితీరును పరిశీలించాలని కోరుతున్నారు

## విద్యార్థినుల భవిష్యత్తు కోసం ప్రత్యేక చర్చలు



**కొత్తూరు, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త :** కొత్తూరులో ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్‌లో తల్లిదండ్రుల సమావేశం, కొత్తూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ శీది బాలికల వసతిగృహంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీలతాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బోర్డర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సౌకర్యాలు, హాస్టల్ నిర్వహణలో తీసుకుంటున్న చర్యలు, విద్యార్థినుల చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థినుల సమగ్ర అభివృద్ధి కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు కలిసి ముందుకు సాగితేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. సమావేశంలో పలువురు తల్లిదండ్రులు హాస్టల్ అభివృద్ధి, విద్యార్థినుల భవిష్యత్తు కోసం తాము అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సంగం శ్రీలతాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : పాండు యాదవ్



**కేశంపేట సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**
పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్నటువంటి సేవలు వెలకట్టలేనివని అన్నారు మణికంఠ మెడికల్ నిర్వాహకులు పిప్పళ్ళ పాండు యాదవ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు వీధులు, రోడ్లు, మురుగు కాలువలు, శుభ్రం చేయడం, చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించడం, వంటి పనులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తారని వారి సేవలు లేకపోతే వ్యాధులు ప్రబలి పర్యావరణం కలుషితమవుతుందని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొనే సవాళ్లు వీరి పనిలో రోగకారక క్రియలు, ప్రమాదకరమైన రసాయనాలు, పదునైన, వస్తువులతో సంబంధం ఉంటుందని, సరైన రక్షణ పరికరాలు లేకపోవడం చాలామంది కార్మికులు వ్యాధులకు గురవుతుంటారని అన్నారు. వారు చేస్తున్న సేవలకు తన వంతు సహాయంగా శనివారం దుస్తులను అందజేసినట్లు పాండు తెలిపారు . గొప్ప మనసుతో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను అందించిన పాండు యాదవ్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మండల కేంద్రం చెందిన పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

**- ఐఐఆర్‌ఎం స్నాతకోత్సవంలో ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వరరావు**



**హైదరాబాద్ సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**
భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, భవిష్యత్ ఎదురయ్యే సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు భారత బీమా రంగం, సంస్థలు పన్నద్ధం కావాలని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్ బి ఐ ) డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు అన్నారు. గచ్చిబౌలిలో శనివారం జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సు రెన్స్, రిస్క్ మేనేజ్ (ఐ ఐ ఆర్ ఎం) స్నాతకోత్సవానికి ఎం.రాజేశ్వర రావు ముఖ్య అతిధిగా హాజరై స్నాతకోపన్యాసం చేశారు. ఐ ఐ ఆర్ ఎం లో 2023 25 విద్యా సంవత్సరంలో పిజిడిఎం విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులకు రాజేశ్వరరావు పట్టాలను ప్రదానం చేశారు. సభకు అతిధులుగా భారత ఇన్సు రెన్స్ రెగ్యులేటరీ, డెవలప్ అథారిటీ (ఐ ఆర్ డి ఎ ఐ ) సభ్యులు రజయ్ కుమార్ సిన్హా, పి.కె.అరోరా, సత్యజిత్ త్రిపాఠి, ఐఐటి సి ఈ ఓ వెంకట్ చెంగవల్లి, ఎస్ బి ఐ లైఫ్ ఇన్సు రెన్స్ చీఫ్ అభిషేక్ ముజుందార్ హాజరయ్యారు. సభలో రాజేశ్వర రావు ప్రసంగిస్తూ ఆర్థిక రంగాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి స్థిరమైన ఆర్థికం, ప్రభావవంతమైన రిస్క్ మేనేజ్ నాయకత్వం అవసరన్నారు. ఐక్యరాజ్య సమితి 2020 23 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని, ఈ వాతావరణ అసమానతలను నియంత్రించనట్లయితే ప్రపంచవ్యాప్తంగా 4 శాతం జిడిపిని నష్టపోయే ప్రమాదం ఉందని, దీని ప్రభావం అన్ని రంగాలపై పడుతుందని, ముఖ్యంగా బీమా రంగంలో పై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ వాతావరణ, సామాజిక భౌగోళికమైన మార్పులు బీమా రంగంలో గణనీయమైన డిమాండ్ పెంచుతుందని, ఇందుకు అనుగుణంగా బీమా రంగం తన సేవలను రూపొందించాలని సూచించారు. ఈ వృద్ధి సాంకేతిక అంశాలు, వాతావరణ మార్పులు, సూక్ష్మ ఆర్థిక వ్యవహారాలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఆర్థిక సంస్థలు ఈ మార్పులను సూక్ష్మంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఐ ఆర్ డి ఎ ఐ సభ్యులు రజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ బీమా, ఆర్థిక సేవల రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని,గ్రాడ్యుయేట్లు వారి వృత్తిపరమైన ప్రయాణాలలో ఆవిష్కరణ, అనుకూలతను ఎప్పటికప్పుడు స్వీకరించాలని సూచించారు.తొలుత ఐ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అరవింద్ కుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ బీమా, రిస్క్ మేనేజ్ అనుబంధ ఆర్థిక సేవలలో ఆవిష్కరణ, నైతిక నా యకత్వాన్ని నడిపించే నిపుణులను పెంపొందించడంలో సం స్థ నిబద్ధతను పునరుద్ఘాటించారు. సభకు ఐ ఐ ఆర్ ఎం ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.కె.మోహన్ వందన సమర్పణ చేశారు.

## గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకం




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

**సైఫాబాద్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** ఈ నెల 11న ఛత్తీస్‌ఘడ్‌లోని గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, తక్షణమే ఈ ఎన్‌కౌంటర్లను ఆపాలని, ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ మధ్య భారతంలో కేంద్ర ప్రభుత్వం 21 నెలలుగా ఆపరేషన్ కగార్ పేరుతో 72 ఎన్‌కౌంటర్ల పేరుతో 670 మందిని హత్యకు గురిచేసిందని ఆరోపించారు. ఈ ఎన్‌కౌంటర్లన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లేనన్నారు. ఈ నెల 11వ తేదీన గరియాబంద్‌లో చేసిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో పది మంది మరణించారని, అందులో కేంద్ర కమిటీ సభ్యుడు బాలకృష్ణతోపాటు ఒరిస్సా రాష్ట్ర కమిటి సభ్యుడు పాండు ఉన్నారని పోలీసులు ప్రకటించారని, ఇప్పటికే మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సంబాల కేశవ రావుతోపాటు అనేక మందిని హతమార్చడం జరిగిందన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన 366 మంది మరణించినట్లుగా తెలుస్తున్నదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం అమలు కాబడుతున్న స్థితిలో ఏ ఒక్కరికి జీవించే హక్కును కూడా ఎన్‌కౌంటర్ పేరుతో హత్యాకాండాలు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణలో అఖిల భారత స్థాయిలో ఏర్పడ్డ శాంతి కమిటీని గుర్తించి, శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సుదర్శన్, పిఎం రాజు, హనుమంతరావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌లో రక్తదాన శిబిరం




రక్తదాన శిబిరంలో పాల్గొని సర్టిఫికెట్లు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్.

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :**
రక్తదాన శిబిరంలో పాల్గొని సర్టిఫికెట్లు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్. గుడిమల్కాపూర్ పి. ఇంద్రారెడ్డి పూల మార్కెట్ లో పూల వ్యాపారుల హోల్ సేల్ అసోసియేషన్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్ లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు... నిత్యం వ్యాపారాలలో మునిగితేలే వ్యాపారులు సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ సందర్భంగా సేకరించిన రక్తాన్ని మెహిదీపట్నం వివేకానంద బ్లడ్ సెంటర్‌కు అందజేయడం జరుగుతుందని మహిపాల్ రెడ్డి తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మునీర్, మాజీ డైరెక్టర్ కృష్ణ గౌడ్, మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్ నాయక్, పూల కమిషన్ ఏజెంట్స్ జగన్, మోహన్ రెడ్డి, చిన్న, అమిత్, కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, తిరుపతి, ఎం.శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధికి ప్రజలు సహకరించాలి: కార్పొరేటర్



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**
ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కట్టుబడి ఉన్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని హరిజన బస్తీలో 6.50 వేలు రూపాయలుతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. బస్తీలోని అన్ని సమ స్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలం యాదవ్, సర్వేశ్ యాదవ్, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలలో విద్యా బోధనాలు జరగాలి : ఎంఇఓ మురళీ క్రిష్ణ



శిక్షణా కార్యక్రమంలో ఎంఇఓ మురళీ క్రిష్ణ

**అల్వాల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే విద్యా బోధనలు జరగాలని ఎంఇఓ మురళీ క్రిష్ణ పేర్కొన్నారు. శనివారం అల్వాల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన రిసోర్స్ పర్సన్ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ అద్వర్యంలో జరిగిన శిక్షణా తరగతుల కార్యక్రమంలో 60 పాఠశాలలు నుంచి 450 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా విద్యలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు, పోటీ తత్వానికి అనుగుణంగా బోధనా పద్ధతులు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. బోధనా విధానం ద్వారా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలులో విజయం సాధించగలుగుతారన్నారు. విద్యలో నైపుణ్యాన్ని మరింత మెరుగు పరచాలని కోరారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రెస్మా అధ్యక్షుడు హరినాథ రావు, మాధవి రెడ్డి, చంద్రమోహన్, సతీష్ పాల్గొన్నారు.

## న్యాయశాస్త్ర సాధన సమాజాభివృద్ధికే దోహదం

**-హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్**




ప్రసంగిస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రావణ్‌కుమార్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** న్యాయశాస్త్రం అనేది సామాజిక మార్పులకు అణుగుణంగా మారుతుందని, న్యాయ వృత్తిగా పరిగణలోకి తీసుకునేవారు జీవితాంతం న్యాయ విద్యార్థిగా ఉండి న్యాయశాస్త్రాన్ని అభ్యసించాలని తెలంగాణ హైకోర్ట్ న్యాయ మార్తి జస్టిస్ ఎన్. వి.శ్రవణ్ కుమార్ అన్నారు. శనివారం చిక్కడపల్లి పెండేకంటి న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా జస్టిస్ ఎన్. వి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయశాస్త్ర సాధన అనేది దేశాబివృద్ధికి, సమాజాభివృద్ధికే దోహద పడుతుందని, విద్యార్థులు న్యాయబద్ధమైన క్రమశిక్షణ తో కూడిన న్యాయ సాధన చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా లెక్స్. విషి యొ పుస్తకా న్ని ఆవిష్కరించారు. వాసవి విద్యాసంస్థలల అధ్యక్షులు పి. రామ్మోహన్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించి వారిని ప్రోత్సహించడానికి, విద్యా సంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని పేర్కొన్నారు. వాసవీ విద్యాసంస్థల కార్యదర్శి ఎం. పార్థసారధి, కోశాధికారి ఎం. ఆనంద్, పెండేకంటి న్యాయ కళాశాల ప్రిన్సిపల్. డాక్టర్ పి. అరవింద్, వైస్.ప్రిన్సిపల్ డాక్టర్ వి. శోభారాణి, అధ్యాపకులు, పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, ఇతర విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## టైలర్స్‌సమస్యల పరిష్కారానికి కృషి : తలసాని



ఎమ్మెల్యే తలసానిని సన్మానిస్తున్న టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** టైలరింగ్ వృత్తిలో పనిచేస్తున్న వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉజ్జయిని మహంకాళి టైలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రతినిధులు తలసానిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో తన సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో రామ్‌గోపాల్ పేట్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నూతన అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు కె.శ్యామ్,వర్కింగ్ ప్రెసిడెంట్ వి.క్రిష్ణ,ప్రధాన కార్యదర్శి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : బానుక నర్మధ



1వ వార్డు ఉమర్ నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న బోర్డు మెంబర్ బానుక నర్మధ, జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. శనివారం 1వ వార్డులోని ఉమర్ నగర్‌లో రూ. 5 లక్షలవ్యయంతో ఓపెన్ నాలా కడకప్పురాలో రూ. 10.50 లక్షల వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బిజెపి నాయకులు జైపాల్ రాఖేష్, రాయల్ కుమార్, ఓం ప్రకాశ్ యాదవ్, బస్తీ పెద్దలు మహ్మద్ బద్రుద్దీన్, దత్తాత్రేయ, నజీర్ హుస్సెన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానంలో వ్యభిచారం

**-పట్టుబడిన నిర్వహకురాలు**
**-నగరం నడిబొడ్డు బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన**

**బేగంపేట సెప్టెంబరు 13,ప్రభాతవార్త**
చివరి మజిలీని సైతం తమ వికృత చేష్టలతో వ్యభిచార కేంద్రంగా మార్చుకుని గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న ఓ మహిళా నిర్వహకురాలితో పాటు మరో మహిళ,విటుడిని పోలీసులు అరెస్ట్ చేసారు.ఈ సంఘటన నగరం నట్ట నడిబొడ్డున ఉన్న బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ ధనియాలగుట్ట వద్ద ఉన్న మహాపరినిర్వాణ (శ్మశాన వాటిక) లోని ఓ గదిలో వ్యభిచార కార్యకలాపాలు గత కొంత కాలంగా సాగుతున్నాయని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ మేరకు పోలీసులు శ్మశాన వాటికలో దాడులు నిర్వహించారు.ఆ సమయంలో ఓ మహిళతో పాటు విటుడు గదిలో ఉండటాన్ని పోలీసులు గుర్తించారు.వారికి నోటీసులు జారీ చేసారు. వేర్వేరు ప్రాంతాల నుంచి మహిళలను ,యువతులను తీసుకువచ్చి ఈ విషయాన్ని విటులకు సమాచారం అందించి వారిని రప్పిస్తున్నట్లు పోలీసుల విచారణలో నిర్వహకురాలు మాధవి ఒప్పుకుంది.దీంతో నిర్వహకురాలు మాధవి తో పాటు గదిలో ఉన్న మహిళ,విటుడుగా వచ్చిన బాలానగర్‌కు చెందిన ఓ సివిల్ కాంట్రాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేసారు.వారి వద్ద నుంచి రూ 1600ల నగదు,మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.నిందితురాలు మాధవి పై బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో కూడా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలియజేసారు.శ్మశాన వాటికలో వ్యభిచా రం నిర్వహిస్తూ పట్టు బడిన సంఘటన హైదరాబాద్ కమీషనరేట్‌లో మొట్టమొదటగా నమోదు కావడం గమనార్హం.



శ్మశాన వాటికను సందర్శించిన కార్పొరేటర్ ,అధికారులు.

బేగంపేట శ్యాలాల్ బిల్డింగ్ ధనియాలగుట్టలో ఉన్న మహాపరినిర్వాణ (శ్మశాన వాటిక)లో వ్యభిచారం నిర్వహిస్తూ మహిళా నిర్వహకురాలు పట్టుబడిన నేపథ్యంలో పత్రికలలో ప్రచురితమైన కథనాలపై స్పందించిన కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలతో శనివారం బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి జీహెచ్ఎంసీ అధికారులతో శ్మశాన వాటికను సందర్శించి పరిశీలించారు. శ్మశాన వాటికలో అవసరాలను గుర్తించి టెండర్లు పిల్చి నిర్వహణకు అవసరమైన అన్ని రకాలైన చర్యలు చేపట్టను న్నట్లు బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి తెలియజేసారు.శ్మశాన వాటికను ఫిల్మ్‌నగర్ మహాప్రస్థానం తరహాలో నిర్మాణం చేయడంతో శ్మశాన వాటికలో అవసరమైన గ్రీనరీ నిర్వహణను హార్టికల్చర్ ఆధ్వర్యంలో చేపట్టేలా చూసేలా ఏర్పాట్లు చేయాలని,కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టి.శ్రీహరి,నాగు రఘునాథ్, నరేష్,శ్రీనివాస్, మాణిక్,రామచందర్,షమి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూట్రీషన్ మంత్‌ను జరుపుకున్న లాలాగూడ రైల్వే సెంట్రల్ హాస్పిటల్

**తార్నాక, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త :** లాలా గూడలోని సెంట్రల్ హాస్పిటల్ లో మెరుగైన జీవితం కోసం సరిగ్గా తినండి అనే థీమ్‌తో న్యూట్రీషన్ మంత్‌ను జరుపుకుంది. దీనిలో భాగంగా మెట్టుగూడా సెంట్రల్ హాస్పిటల్‌లో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం సమక్షంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాలాగూడలోని సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివ నాగ ప్రసాద్, ఇతర సీనియర్ వైద్యులు, నర్సులు, కుటుంబ నియంత్రణ సిబ్బంది, రోగులు మరియు విద్యార్థులు, దాదాపు 200 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సదస్సులో సెంట్రల్ హాస్పిటల్‌లోని సీనియర్ డైటీషియన్ ఆహార మోతాదు, ఫైబర్ అధికంగా ఉండే 7 ఆహార సమూహాలు రోజువారీ జీవితంలో తృణధాన్యాలను చేర్చడంపై ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నుండి డాక్టర్ రాగిణి రోజువారీ ఆహారంలో చేర్చాల్సిన వివిధ పోషకాలపై వివరించారు. ఊబకాయానికి దారితీసే అంశాలపై ఆమె వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినమని ప్రోత్సహించారు. ఈశ్వరీ బాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మరియు



న్యూట్రీషన్ పై రూపొందించిన పోస్టర్లతో డాక్టర్లు

పయనీర్ కాలేజ్ నర్సింగ్ విద్యార్థులు పాలిచ్చే మరియు గర్భిణీ తల్లులకు ఆరోగ్యకరమైన ఆహారంపై వివిధ చార్టులు, పి.ఈ.ఎం చార్టులు మరియు వివిధ వంటకాలను ప్రదర్శించారు.ఈ సంధర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్ మాట్లాడుతూ ఇది ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం యొక్క ప్రాముఖ్యతపై సిబ్బంది,రోగులలో అవగాహన కల్పించడానికి సెంట్రల్ హాస్పిటల్ చేపట్టిన గొప్ప చొరవ అన్నారు. ఒత్తిడి లేని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి వారి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె చెప్పారు.


## విమోచన దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

**-మైలార్‌దేవ్‌పల్లి -2 డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి**



**అత్తాపూర్ సెప్టెంబరు13 ,ప్రభాతవార్త :**
విశ్వకర్మ జయంతి,మోడీ పుట్టిన రోజు, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు మైలార్‌దేవ్‌పల్లి -2 డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం కాటేదాన్‌లో మైలార్దేవ్‌పల్లి2 డివిజన్ అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ జయంతి, తెలంగాణ విమోచన దినోత్సవం సంబంధించి ఏర్పాట్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... .సెప్టెంబర్ 17 - రక్తదాన శిబిరం, జాతీయ జెండా ఆవిష్క రణ, ప్రథమ ఇంజనీర్ విశ్వకర్మని స్మరించుకోవాలని 18 వతేదిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం, 23న బస్తీ పర్యటన చేసి ప్రజల సమస్యల పరిష్కరం కోసం సమావేశం ఏర్పాటు చేసుకోవాలని 25న ప్రతి బూత్‌లో ఒక చెట్టు నాటే కార్యక్ర మం అక్టోబర్ 2 - మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి ని స్మరించుకోవడం వంటి కార్యక్రమాలు చేసేందుకు అ న్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.బిజెపి నాయకులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిల పునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ నాయకులు అడికే రాజు, అడికే మహేందర్, ఓబీసీ మోర్చా నాయకులు బొమ్మ రాజు నర్సింహా , వెంకట్ రమణ గుప్తా, వై ప్రభాకర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, గూడూరి అంజి , కొండల్ రెడ్డి , సకెట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సేవా పక్వాడ్ మండల సమావేశం



**కొత్తూరు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :**
కొత్తూరు మండల కేంద్రంలోని పెప్పరస్ పోర్ట్‌లో శనివారం సేవా పక్వాడ్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సేవా పక్వాడ్ మండల కన్వీనర్ గట్టు శివలింగం అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవా పక్వాడ్ కార్యక్రమాలు నిర్వహించనున్నాం అన్నారు. రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, చిత్రలేఖనం పోటీలు, నమో మారథాన్, చెట్ల నాటడం, దివ్యాంగుల సన్మానం వంటి పలు సేవా కార్యక్రమాలను బూత్ స్థాయిలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రాలకు పుష్పాంజలి ఘటించి, ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాణిక్యం, మండల జనరల్ సెక్రటరీ గణేష్, వనం శీను, బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విక్రమ్ రెడ్డి, బీజేవైఎం జనరల్ సెక్రటరీ మంగలి ప్రశాంత్, మండల కోశాధికారి రాఘవేందర్ గుప్తా, శక్తి కేంద్ర ఇంచార్జ్ శ్రీధర్ చారి, మండల కార్యదర్శి నరసింహ, బూత్ అధ్యక్షులు ప్రశాంత్, హనుమంతు, శ్రీకాంత్, బాలరాజు, రమేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ఉదారతను చాటుకున్న జెపి దర్గా వ్యాపారవేత్త



**కొత్తూరు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:**
జూనియర్ కళాశాల భవనానికి 20 లక్షల విరాళం జేపీ దర్గా వ్యాపారవేత్త ఖాజా పాషా కాజు ను అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. పేద విద్యార్థుల విద్యాభ్యాసం కోసం దాతల సహకారంతో కొత్త భవన నిర్మాణానికి దాతల సహకారం కొనసాగుతోంది. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి శనివారం కొత్తూరు మండలం జేపీ దర్గా కు చెందిన ఆర్ఎంసి ప్లాంట్ యజమాని సయ్యద్ ఖాజా పాషా, కాజు 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఖాజా పాషా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద విద్యార్థుల కోసం నిర్మిస్తున్న విద్యాలయ భవనానికి దాతలు పెద్ద ఎత్తున ముందుకు రావడం అభినందనీయమైన విషయం. జేపీ దర్గాకు చెందిన ఖాజా అందించిన సహాయం ప్రశంసనీయమైంది. ఇలాంటి దాతలు మరింత మంది ముందుకు రావాలి అని ఆయన పేర్కొన్నారు. పేద విద్యార్థుల కోసం పెద్దమొత్తంలో సహాయం అందించిన ఖాజా పాషాను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించారు. విద్యాభివృద్ధికి దోహదపడుతున్న వ్యాపారవేత్తలను సమాజం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## శంకర్‌పల్లిలో వ్యాపారస్తుల ఇబ్బందులు..

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :**
శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 1991 నుండి 2011 వరకు శంకర్ పల్లి పంచాయతీగా ఉన్న సమయంలో దశలవారీగా ఖాళీ జాగాలకు టెండర్లు వేసి అడ్వాన్స్ రూపంలో నగదు తీసుకునేవారు. అడ్వాన్సులు ఎక్కువగా చెల్లించిన వారికి షాపులను కేటాయించి నెలసరి అద్దె 1000 రూపాయలుగా వసూళ్లు చేసేవారు. అయితే అడ్వాన్సుగా లక్షల రూపాయలు వ్యాపారస్తులు చెల్లించవలసి నందున మార్కెట్లో ఉన్న అద్దెలకు సుమారు నాలుగు రెట్లు అధికంగా అద్దెలు చెల్లిస్తున్నామని వ్యాపారస్తులు వాపోతున్నారు. తాము చెల్లించిన రూ6.5 కోట్లను చెల్లించామని తమ డబ్బులను శంకర్ పల్లి గ్రామ ప్రగతి కోసం దశలవారీగా కేటాయించారన్నారు. దుకాణాలపై ఆధారపడి 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని ప్రస్తుతం వారందరి పరిస్థితి రోడ్డు అవకాశం ఉందని వాపుతున్నారు. ఇటీవల అదే తక్కువ ఉందనే ప్రచారం మున్సిపాలిటీలో జోరుగా సాగుతుందని అయితే తాము చెల్లించిన అడ్వాన్సులకు మిత్తి కలిపితే నాలుగు రెట్లు అధికంగా చెల్లిస్తున్నాం అనే విషయాన్ని గుర్తుంచుకొని తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కోరారు.

## పాముకాటుతో రైతు మృతి

**మంచాల సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**
మంచాల మండలం జాపల గ్రామంలో దొంతర మునిలింగమయ్య (37) శనివారం ఉదయం వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు రైతు లింగమయ్య మృతి చెందాడు.


## మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు బంద్



మంచినీటి ట్యాంక్ వద్ద మంచినీళ్లను పట్టుకుంటున్న గ్రామస్థులు

**వెల్దుర్తి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
గత మూడురోజుల నుండి మిషన్‌భగీరథ నీరు బంద్‌కావడంతో మండలంలోని కుకునూరు గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామానికి మిషన్ భగీరథద్వారా వస్తున్న తాగునీరు మూడురోజుల నుండి బంద్‌కావడంతో తీవ్రమంచినీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలో ట్యాంకర్‌ద్వారా నీరు త్రాగునీటికి తీసుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో పంచాయతీ బోరుబావులు ఉన్నప్పటికీ మోటర్లు కాలిపోవడంతో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నప్పటికీ గ్రామం పెద్దదికావడంతో నీరు సరిపోవడంలేదని, అధికారులు స్పందించి నీటి ఎద్దడి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఆకతాయిలకు ప్రభుత్వ పాఠశాలలు అడ్డా...



పాఠశాల వద్ద ఆకతాయిలు తాగిపడేసిన కల్లు సీసాలు దర్శనం

**వెల్దుర్తి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
మండలంలోని ఎలుకపల్లి గ్రామంలో ప్రభుత్వపాఠశాల వద్ద కల్లు సీసాలు దర్శనం ఇస్తున్నాయి. ప్రభుత్వపాఠశాలవద్ద కొందరువ్యక్తులు కల్లుతాగుతూ అక్కడే సీసాలను వదిలేసి అపరిశుభ్రంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పాఠశాలలు మద్యం అడ్డాలుగా మారుతున్నాయని, కొందరు రాత్రివేళలో మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఇలాంటిఘటనలు జరగకుండా చూడాలని, గ్రామంలో ఎవరు ఇలాంటి అగత్యానికి పాల్పడవద్దని గ్రామస్థులు తెలిపారు. ఎవరు ఇలాంటి పనులు చేస్తున్నారని తెలిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఈనెల 17న జిల్లా కబడ్డి సబ్‌జూనియర్ జట్ల ఎంపిక

**పాపన్నపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన పాపన్నపేటలో ఈనెల 17న జిల్లా కబడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా సెక్రటరీ రమేష్ తెలిపారు. ఈనెల 17న పాపన్నపేట ఉన్నతపాఠశాల గ్రౌండ్లో ఉదయం 10గంటలకు ఎంపికలుంటాయని, ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో జరుగబోయే రాష్ట్ర స్థాయి అంతర్‌జిల్లాల కబడ్డి చాపియన్‌షిప్‌లో జిల్లా తరపున పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 16సం.లోపు ఉండాలని, బరువు 55కిలోలకు మించి ఉండకూడదని వెల్లడించారు. మిగతా వివారాలకు 9010735121 నెంబర్లో సంప్రతించాల్సిందిగా సూచించారు.

## ఆలయ పరిసరాలల్లో బిజెపి స్వచ్ఛ భారత్



ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న బిజెపి నాయకులు

**సిర్గాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
బిజెపి పిలుపుమేరకు శనివారం బిజెపి మండలాధ్యక్షులు బిరాదర్ శంకర్ పాటిల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ్‌భారత్ కార్యక్రమంలోభాగంగా ఆలయపరిసరాలను పరిశుభ్రంచేశారు. ప్రతి ఒక్కరు తమ ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం తమ అదుపులో ఉంటుందని బిరాదర్ శంకర్‌పాటిల్ మండల ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, పార్టీ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌పాటిల్, బలరామ్, ఎస్సీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు

**-నానోయూరియాపై రైతులు దృష్టిసారించాలి**
**జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్..**

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రైతులు యూరియాకోసం ఆందోళనచెందవద్దని జిల్లాలో రైతులకు సరఫరాకోసం యూరియా ఉందని, యూరియా కొరతలేదని జిల్లావ్యవసాయ అధికారి దేవకుమార్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలోని రైతువేదికలో రైతులకు యూరియాపంపిణీని ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో నానోయూరియా వినియోగంపై క్షేత్ర సందర్శనలో భాగంగా రైతులకు ఆయన అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా ఆవంచ గ్రామంలోని భాస్కర్‌రెడ్డి అనే రైతు తన 13ఎకరాల వరిపొలంలో నానోయూరియా డ్రోన్‌ద్వారా పిచికారిచేయించగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్‌తోపాటు ఏఆర్‌ఎస్ నత్నాయపల్లి శాస్త్రవేత్త లక్ష్మణ్, ఏడిఏ సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారిణి దీపిక, ఏఈఓ రుతు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**-బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న పాపగారి రమేష్‌గౌడ్, తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
కేంద్రంలో బిజెపిపార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమపథకాలను ప్రజల్లోకితీసుకెళ్లాలని బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షులు నీరుడు చంద్రయ్య, కార్యదర్శి సంఘసాని రాజుల ఆధ్వర్యంలో సేవాపక్షం పట్టణస్థాయి కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, జిల్లాకార్యదర్శి బాదే బాలరాజ్, పట్టణ కన్వీనర్ గుండం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ దుర్గమ్మ దర్శనం బంద్...

**-సింగూరు నుండి 9675 క్యూసెక్కుల వరద**
**-పరిస్థితి సమీక్షించిన అదనపు కలెక్టర్, అడిషనల్ ఎస్పీ**

**పాపన్నపేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని శనివారం మళ్ళీ మూసివేశారు. సింగూరు నుండి 9675 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో, ఘనపురం ఆనకట్ట మళ్ళీ పొంగి పొర్లుతుంది. ఆలయం ముందు నుండి వరద వెళ్తుండటంతో, ఇరిగేషన్ అధికారుల సూచన మేరకు ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ వేరు వేరుగా ఏడుపాయలకు వచ్చి, అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయం ముందు నుంచి వెళ్తున్న మంజీరా వరదలు పరిశీలించారు. అటువైపు భక్తులెవరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాపర్లు ఏర్పాటు చేయాలని, ఘనపురం ఆనకట్ట వైపు ఎవరు వెళ్ళొద్దని, మత్సకారులు, పశువుల కాపర్లు నది వైపు వెళ్ళకుండా చూడాలని సూచించారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఎం.నగేష్

## నర్సింగ్ వృత్తివిద్యలో విద్యార్థినులు రాణించాలి

**-ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**



కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు

**గజ్వేల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో శనివారం ఎంపిహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరం విద్యార్థులకు క్యాపింగ్ సెరిమనీ కార్యక్రమాన్ని స్థానిక కోల అభిరామ్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నర్సింగ్ వృత్తివిద్యా కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థినులను అభినందించారు. విద్యార్థులు ఎంచుకున్న నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైనదని, బాధ్యతతో కూడుకున్నదన్నారు. భవిష్యత్తులో ఈ వృత్తిలో బాగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ వరలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, బిక్షపతి, అనిల్, కృష్ణ, సాయినాథ్, కనకరాజు, భానుచందర్, సంతోషికుమారి, అస్మాఖానమ్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో సెంట్రల్ లైటింగ్

**-ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో అభివృద్ధి దిశగా ముందడుగు**
**-టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు**



క్రేన్ సహాయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటున్నాయి. శనివారం స్థానిక ఎస్సీకాలనీ నుంచి మెదక్ రోడ్డు బ్రిడ్జి వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు టిపిసిసి సభ్యుడు చౌదరి సుప్రభాత్‌రావు ప్రారంభం చేశారు. సుమారు రూ.కోటికి పైగా వ్యయంతో చేపడుతున్న ఈప్రాజెక్టులో భాగంగా 200 బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈసందర్భంగా చౌదరి సుప్రభాత్‌రావు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చూపుతున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, సరాఫ్ యాదగిరి, మర్కు గంగారం, చింతల స్వామి, పిట్ల ప్రకాష్, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, ఎనిశెట్టి అశోక్, బీర రామచంద్రం, దారం సంతోష్‌కుమార్, బొట్ల బాబు, విప్లవ్, గొల్పర్తి రాము, ఎర్రగొల్ల రమేష్, ఎర్రం యాదగిరి, చిలుక విరాట్, చింతల నరేష్‌తోపాటు స్థానికప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## 17న ప్రతి గ్రామంలో జాతీయ జెండాను ఆవిష్కరించాలి

**చిన్నకోడూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈనెల 17న ప్రతి గ్రామంలో జాతీయజెండాను ఆవిష్కరించాలని బిజెపి మండలపార్టీ అధ్యక్షులు సూరగోని శేఖర్‌గౌడ్ అన్నారు. చిన్నకోడూరు మండలకేంద్రంలో శనివారం సేవాపక్షంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. 17న ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా స్వచ్ఛభారత్‌లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంచేయాలని, ప్రతిగ్రామంలో దివ్యాంగులకు సన్మానకార్యక్రమం, రక్తదానశిబిరాలు నిర్వహిద్దామన్నారు. అమ్మపేరుతో మొక్కను నాటాలని పార్టీశ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పిట్ల పరశురాములు, వనజ, బస్వరాజ్, మహేష్, అక్కి సంతోష్‌కుమార్, బాపయ్య, నరేందర్, రాజేష్, స్వామి, కిషన్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ హౌజ్ అరెస్టు



బిజెపి ఎమ్మెల్సీ, బిజెపి జిల్లా అధ్యక్షులను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

**రామచంద్రాపురం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
కేబల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు భారతీయ జనతా పార్టీ మద్దతు ప్రకటించినందున రామచంద్రాపురం పట్టణంలోని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిలు ధర్నాకు వెళ్లకుండా పోలీసులు శనివారం హౌజ్ అరెస్టుచేశారు. ఈసందర్భంగా చిన్నమైల్ గోదావరి, అంజిరెడ్డిలు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అనాలోచిత వైఖరిమూలంగా తెలంగాణ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్, చిన్నస్థాయి కేబుల్ ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారన్నారు. అక్రమ అరెస్టులు తగవని వారు హెచ్చరించారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన బిఆర్‌ఎస్ లాగే కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు.

## మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి

**-ఎఐటియుసి జిల్లా ఉపప్రధాన కార్యదర్శి చిరంజీవి**

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలని ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్‌చేశారు. శనివారం చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల వేతనాలు పెంచాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మికులకు 26వేల రూపాయలకు వేతనాలుపెంచి, ఉద్యోగభద్రత కల్పించాలని, ఈఎస్, పిఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. అధికారులు స్పందించి వేతనాలు పెంచకపోతే రానున్న రోజుల్లో సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు అశోక్, మిషన్ భగీరథ కార్మికులు నగేష్, శివరాజ్, అశోక్, కాశీనాథ్, శంకరప్ప, మల్లికార్జున్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తపస్ మండల నూతన కమిటీ ఏకగ్రీవం

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో శనివారం మండల తపస్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు తపస్ నర్సాపూర్ మండల అధ్యక్షులుగా సిపి.శివకుమార్ (ఎస్‌జిటి, ఎంపియుపిఎస్ తుజాల్‌పూర్), ప్రధాన కార్యదర్శిగా కె.రవికుమార్ (ఎస్‌జిటి ఎంపిపి ఎస్.నారాయణపూర్), కోశాధికారిగా సిహెచ్.కృష్ణ (జెడ్పిహెచ్‌ఎస్ రుస్తుంపేట) ఉపాధ్యక్షులుగా బి.ప్రవీణ్‌కుమార్ (జడ్‌పిహెచ్‌ఎస్ రుస్తుంపేట), పి.శ్రీనివాస్ (ఎంపిపిఎస్ రుస్తుంపేట,), హర్షవర్ధన్‌రెడ్డి (ఎంపియుపిఎస్ అహ్మద్‌నగర్), కార్యదర్శులుగా చెన్నారెడ్డి (ఎస్జీటి ఎంపిపిఎస్ కాకజమజ్జూర్), టి.కిష్టయ్య (ఎస్జీటి ఎంపిపిఎస్ మంతూర్), జి.రాజు (ఎస్జిటి ఎంపిపి ఎస్.తిరుమలాపూర్) ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తపస్ డివిజన్ ఇన్చార్జి నాయిని నరేందర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాంచందర్‌నాయక్, కొండల్ తెలిపారు.

## నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో డిగ్రీ మొదటిసంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.హుస్సేన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ మొదటిసంవత్సరం అడ్మిషన్లు సెప్టెంబర్ 15, నుంచి 16, 2025 వరకు రెండురోజుల పాటు జరగనున్నాయని తెలిపారు. ఉదయం 10:00గంటల నుంచి సాయంత్రం 5:00గంటల వరకు విద్యార్థులు సిద్ధమవ్వాలని ప్రిన్సిపల్ కె.హుస్సేన్ సూచించారు. కళాశాలలో బిఎ(ఇంగ్లీష్‌మీడియం, తెలుగు మీడియం), బి.కామ్(ఇంగ్లీష్‌మీడియం), బిఎస్సి(ఇంగ్లీష్‌మీడియం, తెలుగు మీడియం)కోర్సులకు మిగిలినసీట్లకు అర్హతకలిగిన అభ్యర్థులు తమ డాక్యుమెంట్లతో కళాశాలకు హాజరుకావాలన్నారు. విద్యార్థులు ఎస్‌ఎస్సి మార్క్స్ మెమో, ఇంటర్‌మెమో, ట్రాన్స్ఫర్‌సర్టిఫికేట్, కులంసర్టిఫికేట్(లేటెస్ట్), ఆదాయ సర్టిఫికేట్(లేటెస్ట్), నివాససర్టిఫికేట్, ఆధార్‌కార్డ్, మొబైల్‌నెంబర్, అన్ని బోనఫైడ్స్, ఫోటో, సిగ్నేచర్‌తో కళాశాలలో సంప్రతించాలన్నారు. అధిక సమాచారం కోసం కళాశాల సంప్రతించండి: 9000958212.

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

**-రాజీయే రాజమార్గం**
**-లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమతీర్పు**
**-జూనియర్ సివిల్ జడ్జ్ ఎం. హేమలత**




లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జ్ న్యాయమూర్తి ఎం.హేమలత, తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
లోక్ అదాలతో ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని పేర్కొంటూ ఇందుకు రాజీ పడటమే రాజమార్గమని జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.హేమలత పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లోని కోర్టులో మెదక్ జిల్లా నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.హేమలత మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్ ఇచ్చినతీర్పు అంతిమ తీర్పు అని తెలియజేశారు. ఈమేరకు కక్షిదారులు గ్రామీణ ప్రాంతాల్లో క్షణికావేశంలో ఇరువర్గాలు తగదాలు పడి కోపతాపాలు పెంచుకొని పరస్పరం కేసులు నమోదు చేయించుకొని కోర్టుచుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో తమ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. ఇందుకోసం కక్షిదారులు రాజీ చేయదగ్గ కేసులలో ఇరు వర్గాలు వారు జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై తద్వారా రాజీ కుదుర్చుకొని రాజీపడి కలిసిమెలిసి ప్రేమానురాగాలతో ఉండడమే ఉత్తమమని అన్నారు, ఈకార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.రాఘవేందర్, ప్రభుత్వ సహాయ న్యాయవాది పి.సుధాకర్, లీగల్ సర్వీసెస్ న్యాయవాది బి.స్వరూపరాణి, లీగల్ సర్వీస్ బెంచ్ మెంబర్ మధుశ్రీశర్మ, సీనియర్ న్యాయవాది ఇక్బాల్ జాఫర్, న్యాయవాదులు ఎ.శ్రీనివాస్, ఈ.సత్యనారాయణ, నాగరాజు, కె.రాజునాయక్, ఎండి.ఆరిఫ్, ఎ.సాయిరాం, జె.రవినాయక్, కోర్టు సిబ్బంది, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సిబ్బంది, పోలీస్ కోర్ట్ కానిస్టేబుల్స్, కక్షిదారులు పాల్గొన్నారు.

## ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన ఈటల రాజేందర్



వజ్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపి ఈటల రాజేందర్

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
బిఆర్‌ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి వంటేరు వజ్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయంతెలుసుకున్న మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ శనివారం జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలోని ప్రతాప్‌రెడ్డి స్వగృహానికివచ్చి ప్రతాప్‌రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనవెంట బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్, జగదేవ్‌పూర్ మండలపార్టీ అధ్యక్షుడు దాసరి ఐలయ్యయాదవ్, సీనియర్ నాయకులు శ్రీధర్, బుద్ద మహేందర్, ఐలయ్య, లక్ష్మణ్‌గౌడ్, కుమార్, బీమరి గణేష్, రాజ్ కుమార్, నర్ర నర్సింలు, హరికృష్ణచారి తదితరులు ఉన్నారు.

## తైబజార్ రద్దుతో చిరువ్యాపారులకు ఊరట

**-ఎమ్మెల్యే రోహిత్‌రావు ఫ్లెక్సీకి పాలాభిషేకంతో కృతజ్ఞత**

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ తైబజార్ రద్దుతో చిరువ్యాపారులు సంతోషం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక చిరువ్యాపారులు, రైతులు, కూరగాయల వ్యాపారులు కలిసి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. మున్సిపాలిటీపరిధిలో తైబజార్ వసూలును నిలిపివేసినట్లు అధికారికంగా ప్రకటించడంతో, అప్పటివరకు ఆర్థికభారం ఎదుర్కొంటున్న ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తమ సమస్యను గుర్తించి, తక్షణమే పరిష్కారం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతగా ఈప్రత్యేకకార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మాసాయిపేటలో చోరీ సిసి కెమెరాల్లో రికార్డు

**వెల్దుర్తి, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
మాసాయిపేట మండలంలో శుక్రవారం అర్థరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని ఒక వ్యక్తి గ్రామంలోని లాండ్రీషాప్ తలుపులు ధ్వంసం చేసి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. అలాగే పక్కన ఉన్న కిరణ్ షాపులో సైతం చోరీకిపాల్పడి దొంగలు నగదును ఎత్తుకెళ్లినట్టు బాధితులు తెలిపారు. అనంతరం సాయిబాబా దేవాలయం వద్ద తాళాలు ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా ఆవీడియో సిసి కెమెరాలో రికార్డు అయింది. ఈవిషయం పోలీసులకు తెలపడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**-విలేకరులతో ఎబివిపి రాష్ట్రకార్యదర్శి మాచర్ల రాంబాబు**

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తోందని అఖిలభారత విద్యార్థిపరిషత్ రాష్ట్రకార్యదర్శి మాచర్ల రాంబాబు దుయ్యబట్టారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో స్థానిక సిద్దార్థ పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రబడ్జెట్‌లో 40శాతం విద్యారంగానికి నిధులు కేటాయించినట్లు పేర్కొనడం పచ్చి అబద్ధమని, 40శాతం నిధులు కేటాయిస్తూ రంగాలవారీగా శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీచేసి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా కేవలం 37500 ఉద్యోగాలు మాత్రమే భర్తీచేసి నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని దుయ్యబట్టారు.

**గ్రూప్-1 ఫలితాలపై సిబిఐ విచారణ చేపట్టాలి...**
రాష్ట్రంలో ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలపై పరీక్షలు రాసిన అభ్యర్థులలో తీవ్ర అనుమానాలు ఉన్నందున ప్రభుత్వం వెంటనే సిబిఐ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 ఫలితాలలో ముఖ్యమంత్రి బంధువులు, అన్నదమ్ములు, మంత్రులకు 500పైగా అభ్యర్థులనుంచి కోటి రూపాయలకు పైగా ముడుపులుతీసుకుని వారికి ఉద్యోగాలు కట్టబెట్టాలని ప్రభుత్వంచూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వయూనివర్సిటీ భూములను అమ్ముకుంటూ ప్రయివేట్‌యూనివర్సిటీలకు వత్తాసు పలుకుతుందని మండిపడ్డారు. ప్రయివేట్ జూనియర్ డిగ్రీకళాశాలలకు బకాయిలు చెల్లించకుండా యూనివర్సిటీలకు కమిషన్లు తీసుకుని స్కాలర్‌షిప్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తోందని ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో ఎబివిపి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ఆకాష్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాజేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్, రాష్ట్ర అగ్రివిజన్ కన్వీనర్ మానస, సిద్దిపేట కన్వీనర్ ఆధిత్య తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

**-సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి**

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవితాదేవి పేర్కొన్నారు. సీనియర్ కోర్టు విభాగంలో 89 బ్యాంక్ పియల్సి కేసులు, 14 సైబర్ క్రైమ్ కేసులు, 6 సివిల్ కేసులు పరిష్కారం కాగా 89 లక్షల 08వేల 130 రూపాయలను వసూలు అయ్యాయన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు, ఏడియం కోర్టు విభాగాలలో 8క సివిల్ కేసులు, 44 క్రిమినల్ కాంపౌండ్ కేసులు, 37 అడ్మిషన్ కేసులు, 9 ఎక్సైజ్ కేసులు పరిష్కారం అయి 64500 రూపాయలు వసూలు అయ్యాయన్నారు.

## జాతీయ పునర్నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

**-ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు**

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
జాతీయ పునర్నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. శనివారం పట్టణంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఎబివిపి మెదక్ విభాగ్ అభ్యాస వర్గ ప్రారంభం కార్యక్రమంలో రాంబాబు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి మహంత్ సిద్దేశ్వర నందగిరి మహారాజ్, ఎబివిపి మెదక్ విభాగ్ కన్వీనర్ ఆకాష్, కార్యదర్శి అక్షణ్, జిల్లాప్రముఖ్ మాధవరెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కన్వీనర్‌లు రాజు, ఆదిత్య, అగ్రివిజన్ రాష్ట్ర కన్వీనర్ మానస, రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ ఉదయ్‌సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేష్, ప్రసాద్, ఎబివిపి పూర్వ కార్యకర్తలు దత్తాత్రి జగన్నాథ్, మహిపాల్‌రెడ్డి, విశ్వనాథ్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, ఆనంద్, ఈశ్వర్, నరేష్, సాయిలు, నవీన్, శ్రీనివాస్, తుక్కప్ప, ఆంజనేయులు, బస్వరాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 4334 కేసులు పరిష్కారం

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర**

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కోర్టు ఆవరణలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికారసంస్థ ఆదేశాలమేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సౌజన్యంతో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.భవానిచంద్ర పేర్కొన్నారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 3850 క్రిమినల్ కేసులు, 22సివిల్ కేసులు, 21మోటారు వాహన ప్రమాద కేసులు, 40 ప్రీలిటిగేషన్ కేసులు, 58బ్యాంక్ రికవరీకేసులు, 105సైబర్‌క్రైమ్‌కేసులు, 238విద్యుత్‌చౌర్యం కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రత్యేకన్యాయమూర్తులు కె.జయంతి, జి.సునీత, లావణ్య, బి.సౌజన్య, దీప్తి, అనిత, న్యాయమూర్తి కె.ధనలక్ష్మి, టి.దుర్గారాణి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభుధాన్యం, సత్యనారాయణ, జిల్లా రెవిన్యూ అధికారి పద్మజారాణి, డిసిపి సత్తయ్య, న్యాయవాదులు, పోలీసులు బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.